క్లుప్తంగా

గుంపులుగా సంచరిస్తే అదుపులోకి తీసుకుంటాం



పోలకల్ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల ఎక్కింపు నేపథ్యంలో మంగళవారం 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని.. నలుగురికి మించి సంచరిస్తే అదుపులోకి తీసుకుంటామని ఎస్‌ఐ తిమ్మారెడ్డి అన్నారు. సోమవారం పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఫలితాలు వెలువడనున్న దృష్ట్యా విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా పేలుళ్లపై నిషేధం ఉన్నట్లు తెలిపారు. ఫలితం ఎలా ఉన్నా అందరూ సంయమనం పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

అనవసరంగా బయటకు రావొద్దు



సూచనలు చేస్తున్న ఎస్పీ

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మంగళవారం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హైవే వెంట దుకాణదారులకు పలు సూచనలు చేశారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది చేరితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. బయట ప్రాంతాల నుంచి ఎవరూ పాణ్యం చుట్టుపక్కల రాకూదని హెచ్చరించారు. అనుమానితులు కనిపిస్తే అదుపులోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. రహదారి పక్కనున్న దుకాణాలు, కూడళ్లలోని షాపులు మూసివేసి పోలీసులకు సహకరించాలన్నారు. విజయోత్సవం ర్యాలీలు, ఊరేగింపులపై నిషేధం ఉందని తెలిపారు. అనవసరంగా ఇళ్ల నుంచి బటకు రావొద్దని సూచించారు.

హంద్రీ వంతెనపై పేరుకుపోయిన మట్టి



కోడుమూరు హంద్రీ వంతెనపై పేరుకుపోయిన మట్టి

కోడుమూరు రూరల్: కోడుమూరు–బళ్లారి రోడ్డులోని హంద్రీనది వంతెనపై ఇరువైపులా మట్టి పేరుకుపోయింది. వంతెనపై ఉన్న మట్టిని సకాలంలో తొలగించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో వంతెనపై పడ్డ వర్షపునీరు వెళ్లే పైపులైన్లన్నీ మూసుకుపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వంతెనపై పడ్డ వాన నీరు వెళ్లేందుకు దారిలేక వంతెనపైనే రోజుల తరబడి నిల్వ ఉంటోంది. నీటి నిల్వతో ఇటు వాహనదారులు ఇబ్బందులు పడుతుండగా, వంతెనపై భాగమంతా భారీగా దెబ్బతింటోంది. ఇకనైనా అధికారులు స్పందించి వంతెనకిరువైపులా పేరుకుపోయిన మట్టిని తొలగించి వాననీరు సక్రమంగా పైపుల్లో వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, దెబ్బతిన్న వంతెనకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కల్యాణ మండపంపై పిడుగుపాటు



దెబ్బతిన్న కల్యాణమండపం దిన్నె

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె క్రిష్ణమ్మకోన ఆలయం వద్ద ఉన్న మినీ కల్యాణ మండపం పిడుగుపాటుకు దెబ్బతింది. సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పిడుగు పడడంతో స్వల్పంగా దెబ్బతిన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

సత్సంగాలతో ఐక్యత పెంపొందుతుంది

కర్నూలు కల్చరల్: సత్సంగాలతో ఐక్యతా భావం పెంపొందుతుందని లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శ్రీ లలితా సుందేశ్వర స్వామి సత్సంగం ఆధ్వర్యంలో మాతృమూర్తుల సత్సంగం ఒడిబియ్యం కార్యక్రమాలు జరిగాయి. మహిళలు ఒకరికొకరు ఒడిబియ్యం పెట్టుకున్నారు. లలితా సహస్రనామ పారాయణం చేశారు.



నెరవాడ పాత బ్రిడ్జిపై పొంగి ప్రవహిస్తున్న వక్కెర వాగు



పర్ల గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



పాణ్యం స్టీల్‌ప్లాంట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వొద్దెల వాగు



నిలిచిపోయిన వాహనాలు

కురిసిన వాన.. మురిసిన నేల

- దంచి కొట్టిన వర్షం
- కల్లూరు మండలంలో 65.6 మి.మీ వర్షపాతం
- పొంగిన వాగులు, వంకలు
- ఆనందంలో రైతన్నలు



సుగాలిమెట్టలో ఇళ్లలోకి చేరిన నీరు



భూపనపాడు–కొలూరు రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



కోడుమూరులో జలమయమైన వీధి

కల్లూరు: రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దీంతో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజామున నుంచి ఉదయం వరకు వర్షం దంచి కొట్టింది. గ్రామాల్లో వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పర్ల గ్రామంలో చిన్న వాగు, పెద్ద వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు సాగించడానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. నెరవాడ బ్రిడ్జిపై వక్కెర వాగు పొంగి ప్రవహించింది. నెరవాడ గ్రామ ప్రజలు ఇబ్బందులను చూసిన ప్రభుత్వం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తోంది. కొద్ది రోజుల్లో బ్రిడ్జి పనులు పూర్తికానున్నాయి. ఇది పూర్తయితే వక్కెర వాగు ఎంత పొంగి ప్రవహించినా ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రైతన్నల హర్షం

కొద్ది రోజులుగా ఎండ తీవ్రత పెరిగి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో నేల మురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. మూడు పదున్ల వర్షం కురిసిందని రైతన్నలు ఆనందంలో ఉన్నారు. వారం, పదిరోజుల్లో ఖరీఫ్ పంటలు సాగు అయ్యే అవకాశం ఉంది. మండలంలో ఇప్పటికే బోర్ల కింద రెమడూరు, పుసులూరు, బొల్లవరం, ఇతర గ్రామాల్లో పంటల సాగు చేశారు. వర్షం కురవడం వల్ల పంటలకు జీవకళ వస్తుందని ఆయా గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కురిసిన వర్షం వల్ల మెట్ట భూముల్లో కూడా విత్తనాలు విత్తడానికి రైతులు సిద్ధమవుతున్నారు. మండలంలో 65.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో గత ఏడాది కంటే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

పొంగిపొర్లిన వాగులు

పాణ్యం: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. పాణ్యం–కొనిదేడు గ్రామాల మధ్యనున్న వొద్దెల వాగు బ్రిడ్జిపై 4 అడుగుల మేర వరదనీరు ప్రవహించింది. దీంతో బనగానపల్లెకు వెళ్లే బస్సులు, వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం 11గంటల వరకు వరద ఉధృతి తగ్గలేదు. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. అలాగే గోనవరం గ్రామం వద్దనున్న బ్రిడ్జిపై వరదనీరు ప్రవహించింది. భూపనపాడు–కొలురు గ్రామాల మధ్య వాగు ఉధృతంగా ప్రవహించడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సుగాలిమెట్టలో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో 153.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే ఆర్జీఎం కళాశాల మైదానంలో వర్షపునీరు చేరడంతో అధికారులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్లా విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. పర్ల గ్రామంలోని రేషన్ దుకాణంలోకి నీరు చేరింది.

కోడుమూరులో 43.2 మి.మీ వర్షపాతం

కోడుమూరు రూరల్: కోడుమూరులో 43.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురవడంతో పట్టణంలోని వీధులన్నీ జలమయమయ్యాయి. వారం రోజుల నుంచి తీవ్రమైన ఉక్కపోత, వడగాల్పులతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షం రాకతో వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో భూములు పదునెక్కడంతో ఖరీఫ్ సీజన్‌కు పత్తి, కంది, కొర్ర, వేరుశనగ వంటి పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

గూడూరులో 45.6 మి.మీ..

గూడూరు: మండలంలో ఆదివారం రాత్రి నుంచి ఎడతెరపి లేని వాన పడింది. పట్టణంలో 45.6 మి.మీ వర్షపాతం నమోదైంది. పెంచికలపాడు వక్కెర వాగు పొంగిపొర్లుతోంది. దీంతో గూడూరు–కర్నూలు మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వ్యవసాయ పనులకు ఈ వాన ఎంతో దోహదం చేసిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

సి.బెళగల్‌లో 12.6 మి.మీ.

సి.బెళగల్: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 12.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల గణాంకాధికారి ఆదినారాయణ తెలిపారు. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు వర్షం కురవడంతో హర్షం వ్యక్తం చేశారు. పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. .

పొరపాట్లకు తావివ్వొద్దు

- మైక్రో అబ్జర్వర్లకు సూచించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు జాఫర్, మీర్ తారిఖ్ అలీ





శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సాధారణ పరిశీలకులు జాఫర్, మీర్ తారిఖ్ అలీ, కలెక్టర్ జి.సృజన, హాజరైన మైక్రో అబ్జర్వర్లు

కర్నూలు(సెంట్రల్): కౌంటింగ్ ప్రక్రియలో లోటుపాట్లకు తావులేకుండా మైక్రో అబ్జర్వర్లు అన్ని విషయాలను నిశితంగా పరిశీలించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు జాఫర్, మీర్ తారిఖ్ అలీ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు–2024 కౌంటింగ్ నిర్వహణపై జనరల్ అబ్జర్వర్ల సమక్షంలో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కౌంటింగ్ ప్రక్రియలో జరిగే ప్రతి అంశంపై నిశిత పరిశీలన చేసి నోట్ చేసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది నమోదు చేసుకుంటున్న వివరాలను పరిశీలించి నోట్ చేసుకొని తరువాత ఏజెంట్లు, సిబ్బందితో నివేదికలతో సరిపోల్చుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ..జూన్ 2వ తేదీన కౌంటింగ్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లను ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయించినట్లు చెప్పారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లకు ఒక్కో మైక్రో అబ్జర్వర్ ఉండడంతో పాటు జనరల్ అబ్జర్వర్ల ప్రతినిధులుగా కొంత మంది మైక్రో అబ్జర్వర్లను నియమించనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నిబంధనల మేరకు విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అన్ని విషయాలను పరిశీలించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు గుర్తింపు కార్డులను కచ్చితంగా తీసుకెళ్లి చూపిస్తే అనుమతి ఇస్తారన్నారు. గుర్తింపు కార్డులను కలెక్టరేట్‌లో పొందాలని, 4వ తేదీన ఉదయం 5 గంటలకు కలెక్టరేట్ నుంచి బస్సుల్లో తరలించేందుకు ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. అనంతరం ఈవీఎం కౌంటింగ్, మైక్రో అబ్జర్వర్ల విధులపై ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి సిద్ధలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సోమశేఖరరెడ్డి వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

- సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్

కర్నూలు (సెంట్రల్) : సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మాట్లాడుతూ పోస్ట్ పోల్ సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ను ఓపెన్ చేయడానికి కార్పెంటర్, ఎలక్ట్రీషియన్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదే విధంగా సిబ్బందిని కౌంటింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు అవసరమైన బస్సులను నిర్దేశించిన సమయంలో కలెక్టరేట్ వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల విభాగ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, పాణ్యం రిటర్నింగ్ అధికారి/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు రిటర్నింగ్ అధికారి/మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, ఆదోని రిటర్నింగ్ అధికారి/సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, పత్తికొండ రిటర్నింగ్ అధికారి/ఆర్‌డీఓ రామలక్ష్మి, కోడుమూరు రిటర్నింగ్ అధికారి శేషిరెడ్డి, ఎమ్మిగనూరు రిటర్నింగ్ అధికారి చిరంజీవి, మంత్రాలయం రిటర్నింగ్ అధికారి విశ్వనాథ్, ఆలూరు రిటర్నింగ్ అధికారి రాము నాయక్, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, మెప్మా పీడీ నాగశివలీల, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో నిబంధనలు తప్పనిసరి



ఓట్ల లెక్కింపు అధికారులు, సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఆర్‌ఓ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి నియమించిన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కర్నూలు అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సిబ్బంది అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రత్యేకించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో చెల్లిన, చెల్లని బ్యాలెట్ ఓట్లను జాగ్రత్తగా పరిశీలించి లెక్కించాలన్నారు. అభ్యర్థులకు పోలైన ఓట్లను సంబంధిత పత్రాల్లో నమోదు చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా అంకెలను స్పష్టంగా పేర్కొనాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లను అనుమతించబోమని, ఒకవేళ తెచ్చుకుంటే వాటిని పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో భద్ర పరచాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, మెప్మా పీడీ నాగశివలీల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో భద్ర పరచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు.

నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

- కర్నూలు అసెంబ్లీ బరిలో 25 మంది
- ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, 19 రౌండ్లు
- పోలైన ఓట్లు 1,74, 973

కర్నూలు (టౌన్): సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. గత నెల 13 వ తేదీన ఎన్నికల పోలింగ్ జరిగింది. ఫలితం కోసం అభ్యర్థులు 21 రోజులు నిరీక్షించారు. ఎట్టకేలకు మంగళవారం ఫలితాలు రానుండటంతో ఉత్కంఠకు తెరపడనుంది. కర్నూలు అసెంబ్లీ బరిలో అధికార, ప్రతిపక్ష పార్టీ, ఇండిపెండెంట్లతో కలుపుకుని మొత్తం 25 మంది బరిలో ఉన్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, కూటమి అభ్యర్థుల మధ్య పోటీ జరిగింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో కౌటింగ్ ప్రారంభం కానుంది.

ఆర్‌యూలో ఓట్ల లెక్కింపు

కర్నూలు అసెంబ్లీకి సంబంధించి నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పటికే కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు 10 రోజులుగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం బిజీబిజీగా ఉంది. కర్నూలు అసెంబ్లీ నియోజవర్గానికి సంబంధించి ఆర్‌ఓతో పాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (మోహన్‌కుమార్), ప్రత్యేక పర్యవేక్షణ అధికారులుగా అడిషనల్ కమిషనర్ (రామలింగేశ్వర్) డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి (పోస్టల్ బ్యాలెట్ ఇన్‌చార్జ్)లు వ్యవహరిస్తారు. అలాగే ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి పర్యవేక్షణ చేస్తారు. కాగా అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు సంబంధించి 14 టేబుళ్ల ఏర్పాటు చేశారు. 19 రౌండ్లలో ఫలితం తేలనుంది. అరగంటకు ఒక రౌండ్ పూర్తి అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల మధ్య అధికారికంగా ఎవరు గెలిచారో ప్రకటిస్తారు.

సాధనతో క్రీడల్లో రాణింపు

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణించాలంటే ప్రతి రోజు సాధన చేయాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సమ్మర్ హ్యాండ్‌బాల్ కోచింగ్ క్యాంపు క్రీడాకారులకు దాతలు శ్రీధర్ రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శిక్షకులు సుంకన్న పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం



మాట్లాడుతున్న నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి



పాల్గొన్న పోలీస్ అధికారులు

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా ఏర్పాట్లపై కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు, నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సోమవారం ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రాల పరిసరాలు, నియోజకవర్గాల కౌంటింగ్ ఏరియా, పార్కింగ్ ప్రదేశాలను సెక్టార్లుగా విభజించి నిర్వహించాల్సిన విధుల గురించి తెలియజేశారు. కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. మూడంచెల భద్రతతో పాటు సాయుధ బలగాలతో పెట్రోలింగ్, మొబైల్ పార్టీలను మొహరించి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు ముగిసే వరకు పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి అభ్యర్థులు, వారి ఏజెంట్లు, రిటర్నింగ్ అధికారులతో ధ్రువీకరించిన గుర్తింపు కార్డులు ఉన్న వ్యక్తులు మినహా ఇతరులు ఎవరికీ లోనికి ప్రవేశం లేదన్నారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే అనుమతించాలని తెలిపారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే ఏజెంట్ల వాహనాలను నిర్దేశించిన ప్రదేశాల్లో పార్కింగ్ చేయించాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు, ఘర్షణలకు పాల్పడే వ్యక్తులను ఆర్వో ఆదేశాల మేరకు వెంటనే పికప్ వాహనాల్లో ఎక్కించాలన్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం వహించొద్దని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమల్లో ఉందని, మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ బృందాలు, స్పెషల్ స్ట్రైకింగ్ బృందాలు అలెర్ట్‌గా ఉండాలని సూచించారు. ర్యాలీలు, ఊరేగింపులు నిషేధమని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్, డీఎస్పీలు కుమారస్వామి, రవీంద్రనాథరెడ్డి, శ్రీనివాసరావు, తిలక్, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.